క్లుప్తంగా

బాధిత కుటుంబానికి వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: నియోజకవర్గంలోని 36వ వార్డులో మృతి చెందిన గుమ్మడి పెంటమ్మ దశ దినకర్మకు వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆశీల్‌మెట్టలోని కార్యాలయంలో ఆయన పెంటమ్మ కుమారులకు ఈ మొత్తాన్ని అందజేశారు. గతంలో పెంటమ్మ వైద్య ఖర్చులకు కూడా ఆయన సహాయం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మృతురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ధరిత్రి దినోత్సవం



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిమ్నోస్పర్మ్ గార్డెన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎంఏ నివేదిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ జె. లావణ్యతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో ఏఎంసీకి కాంస్యం



కాంస్య పతకం సాధించిన ఏఎంసీ జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

దాబాగార్డెన్స్: ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ) విద్యార్థులు ఏపీ స్టేట్ మెడికల్ అండ్ డెంటల్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో ఈ నెల 16 నుంచి 20 వరకు ఈ పోటీలు జరిగాయని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ పాత్రుడు తెలిపారు. మంగళవారం ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి, వైస్ ప్రెసిడెంట్ (క్రీడలు) డాక్టర్ ఆర్. సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ పాత్రుడు, జట్టు కెప్టెన్ వీజీఎస్ కార్తీక్, వైస్ కెప్టెన్ పి. ఠాగోర్ ప్రసాద్, జట్టు సభ్యులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాల కీర్తిని మరింత ఇనుమడింపజేయాలని వారు ఆకాంక్షించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 40 జట్లు పాల్గొన్నట్లు ఫిజికల్ డైరెక్టర్ పేర్కొన్నారు.

గురుకులంలో ముగిసిన వేసవి శిక్షణ



సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన విద్యార్థులు. చిత్రంలో సర్వశిక్ష అభియాన్ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకృష్ణాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ నిర్వహించారు. 12 రోజులు పాటు జరిగిన వృత్తి విద్య నైపుణ్య శిక్షణలో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించారు. వ్యక్తి ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్మం, జుట్టు, గోళ్ల తదితర బాహ్య అంగాలను ఏవిధంగా సంరక్షించుకోవాలి అనేదానిపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ మంగళవారంతో ముగిసింది. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్ సిబ్బంది సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండకు ఎదురేగి..

నిప్పుల కొలిమిలో బతుకుపోరు..



మండుటెండలోనే కూరగాయలు విక్రయిస్తున్న వృద్ధులు

దాబాగార్డెన్స్ : నిప్పులు కురిపిస్తున్న భానుడి..సామాన్యుడిని బెంబేలెత్తిస్తోంది. బయట అడుగు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి. కానీ, కొందరికి తప్పదు. పొట్ట నింపుకోవడానికి, బతుకు బండి లాగడానికి మండుటెండలోనే శ్రమించక తప్పడం లేదు. రోజువారీ కూలీలు, రిక్షా కార్మికులు, పారిశుద్ధ్య సిబ్బంది, లారీ డ్రైవర్లు, క్లీనర్లు, చిల్లర వ్యాపారులు... వీరంతా ఎండ వేడిమిని లెక్కచేయకుండా తమ పనులు చేసుకుంటున్నారు. నెత్తిన సూరీడు నిప్పులు చెరుగుతున్నా, వీరు మాత్రం తమ శ్రమతోనే జీవితాన్ని వెళ్లదీస్తున్నారు. పొట్ట నిండాలంటే పనిచేయక తప్పని నిస్సహాయ స్థితి వారిది. ఎండ ఎంత తీవ్రంగా ఉన్నా, తప్పనిసరి పరిస్థితుల్లో పనిచేయాల్సి వస్తోంది. చెమటోడుస్తూ పనిచేస్తేనే వారికి ఆ రోజు గడిచేది. అందుకే, ఎండను భరిస్తూ, తమ కష్టాన్ని నమ్ముకుని ముందుకు సాగుతున్నారు.



మండుటెండలో పొట్టకూటికోసం అవస్థలు పడతున్న చిరు స్వర్ణకారుడు

ఊయల కొంటేనే పూట గడిచేది



నా వయస్సు 80 ఏళ్లు. నాకు ఎవరూ లేరు. ఉదయం నుంచి ఏదో ఓ చెట్టుకి తాను అల్లిన ఊయలలు కట్టి విక్రయిస్తుంటాను. ఎవరైనా కొనుగోలు చేస్తేనే ఆ పూట గడిచేది. లేదంటే పస్తులే. నా అన్నవాళ్లు లేక అత్యంత దీనస్థితిలో బతుకీడుస్తున్నాను. ఈ వయసులో కూడా కష్టపడాల్సిన పరిస్థితి.

–సూరిబాబు

పది కుటుంబాలకు ఉపాధి కల్పించాను..



నా వయస్సు 85 ఏళ్లు. భర్త చనిపోయాడు. మా అమ్మవారి ఊరు కొండకర్ల. అత్తారిల్లు పాతనగరం చెంగల్రావుపేట. నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశాను. కుమారుడు ఆటో డ్రైవర్. కోడలు చనిపోయింది. పిల్లలతోనే కుమారుడు బతుకుబండి ఈడ్చుతున్నాడు. వారి ఆదాయం అంతంత మాత్రమే. మనమడు వద్ద ఉంటున్నాను. ఉదయం నిద్ర లేచి వేరుశనగలు వేపుతాను. కాస్తా గంజి ముద్ద తిని వేరుశనగలు పట్టుకుని రోడ్డెక్కుతాను. సాయంత్రం పొద్దు పోయే వరకు విక్రయిస్తా. ఇంటికి వచ్చి కాస్తా ముద్ద తిని పడుకుంటాను. గతంలో మాకు బేకరి ఉండేది. మేమే 10 కుటుంబాలకు ఉపాధి కల్పించాం. ప్రస్తుతం నా పరిస్థితి ఇలా మారింది. రోడ్డున పడ్డాను. 85 ఏళ్ల వయస్సులో మండుటెండల్లో కూడా పనిచేయ కతప్పడం లేదు.

–సత్యవతి

కేజీహెచ్‌ను సందర్శించిన అదనపు డీఎంఈ



కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు సూచనలు చేస్తున్న అదనపు డీఎంఈ

దాబాగార్డెన్స్: అదనపు డీఎంఈ డాక్టర్ డి. వేంకటేశ్వరరావు మంగళవారం కింగ్ జార్జ్ హాస్పటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాద విభాగం (క్యాజువల్టీ)ను పరిశీలించి, రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో నర్సింగ్ సూపరింటెండెంట్‌తో నర్సింగ్ సిబ్బంది రోస్టర్లపై చర్చించారు. త్వరలో ప్రారంభించనున్న కొత్త వార్డులను కూడా ఆయన పరిశీలించారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపల్, కేజీహెచ్ సూపరింటెండెంట్, ఇతర ఆస్పత్రి ప్రతినిధులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లతో డాక్టర్ వేంకటేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోగుల సంరక్షణకు అవసరమైన వైద్య పరికరాలను జెమ్ పోర్టల్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా వైద్యులు సమయపాలన పాటించాలని, ఎన్టీఆర్ వైద్య సేవల కేసుల సంఖ్యను పెంచాలని ఆయన ఆదేశించారు.

ప్రపంచ కార్మికోద్యమ వేగుచుక్క లెనిన్



లెనిన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా సమితి సభ్యులు

అల్లిపురం: ప్రపంచ కార్మికోద్యమ వేగుచుక్క లెనిన్ అని సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొనియాడారు. లెనిన్ 155వ జయంతి సందర్భంగా మంగళవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు మాట్లాడుతూ, ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని మార్క్స్ ఇచ్చిన పిలుపును అందుకుని లెనిన్ రష్యాలో తొలి సోషలిస్టు ప్రభుత్వాన్ని నిర్మించారని అన్నారు. లెనిన్ నాయకత్వంలో జరిగిన అక్టోబర్ సోషలిస్టు విప్లవం విజయం తర్వాత ప్రపంచంలోని అనేక దేశాల్లో విముక్తి ఉద్యమాలు ఊపందుకున్నాయని ఆయన పేర్కొన్నారు. లెనిన్ చూపిన పోరాట స్ఫూర్తి భారత కమ్యూనిస్టు ఉద్యమంపై గొప్ప ప్రభావాన్ని చూపిందని, అది ఇప్పటికీ కొనసాగుతోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, కె. సత్యాంజనేయ, ఎం. మన్మథరావు, జి. రాంబాబు, సీఎస్. క్షేత్రపాల్ రెడ్డి, ఎస్. సూరిబాబు, జి. కాసులరెడ్డి, ఎస్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని జిల్లా బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, పెండింగ్ క్లెయిమ్‌ల చెల్లింపు, రెన్యువల్ కోసం ఈ నెల 24న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపడతామని ఆయన వెల్లడించారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, అధికారంలోకి వచ్చి 10 నెలలైనా సంక్షేమ బోర్డును పునరుద్ధరించక పోవడం అన్యాయమన్నారు. భవన నిర్మాణ కార్మికుల నిధులను వారి అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టి చలో విజయవాడ నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నెల 24న జీవీఎంసీ గాంధీ పార్కులో జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో పోలేశ్వరరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబసభ్యుల చెంతకు మహిళ



లలితను కుటుంబసభ్యులకు అప్పగించిన ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

సీతమ్మధార: ఈ నెల 19న రైల్వే పోలీసులు రక్షించిన వివాహిత లలితను ఎట్టకేలకు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. కోనసీమ జిల్లా, మండపేట మండలం, డి.కేశవరానికి చెందిన లలిత అదృశ్యంపై అన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. రైల్వే పోలీసులు లలితను గుర్తించి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది లలితకు కౌన్సిలింగ్ ఇచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఆమె తన తమ్ముడు శివన్నారాయణ ఫోన్ నంబర్ చెప్పడంతో, అతన్ని వెంటనే రప్పించి లలితను క్షేమంగా అప్పగించినట్లు ఏయూటీడీ కోఆర్డినేటర్ వాసు తెలిపారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీసీఆర్ శ్రీనివాస్

జగదాంబ: ఆస్తి , నీటి పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ రెవెన్యూ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడుతో కలిసి రెవెన్యూ అధికారులు, సెక్రెటరీలు, ట్యాక్స్ కలెక్టర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న 50 శాతం వడ్డీ రాయితీపై అవగాహన కల్పించి బకాయిలు పరిష్కరించేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 5 శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకునేలా ప్రజలు త్వరగా పన్నులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే రాయితీ అవకాశం ఉందన్నారు. సచివాలయాల పరిధిలోని సెక్రెటరీలు , రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు) నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుని, ఏప్రిల్ నెలాఖరు నాటికి ఆస్తి పన్ను, నీటి పన్నుల వసూలును పూర్తి చేయాలని శ్రీనివాస్ స్పష్టం చేశారు. పన్ను చెల్లింపుదారుల నుంచి నేరుగా చెక్కులు తీసుకోకుండా, కమిషనర్ జీవీఎంసీ పేరుతో డిమాండ్ డ్రాఫ్టులు (డీడీలు) మాత్రమే స్వీకరించాలని ఆయన సూచించారు. సమావేశంలో ఆర్వోలు పడాల్, అప్పలరాజు, ఆర్ఐలు సీతారాం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మే 10,11 తేదీల్లో సీపీఐ జిల్లా మహా సభలు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా సమితి సభ్యులు

అల్లిపురం: సీపీఐ జిల్లా మహాసభలు మే 10, 11 తేదీల్లో మురళీనగర్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు మహాసభల పోస్టర్లను అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, కె. సత్యాంజనేయ, ఎం. మన్మథరావు, జి.రాంబాబు, సీఎస్. క్షేత్రపాల్ రెడ్డి, ఎస్. సూరిబాబు, జి. కాసులరెడ్డి, ఎస్. నాగభూషణం తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూసమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడేందుకు పోరాటాలు చేస్తామని వారు తెలిపారు. నగరంలో ఐటీ అభివృద్ధి తదితర సమస్యలను మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు.

సందడిగా ‘మీట్..గ్రీట్..ట్రీట్’



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ , విశాఖ బాలోత్సవ్ కమిటీ సంయుక్తంగా ‘మీట్..గ్రీట్..ట్రీట్’ పేరుతో సీనియర్ సిటిజన్ల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ వేడుక ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ వి. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ, గత ఏడాది జరిగిన మొదటి ఎంజీటీ కార్యక్రమం విజయవంతమైందని, ఈసారి సీనియర్ సిటిజన్లలో మరింత ఉత్సాహం కనిపిస్తోందన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ఏడాదికి కనీసం మూడుసార్లు నిర్వహించాలని ఆయన నిర్వాహకులను కోరారు. డాక్టర్ పీకే జోష్ నేతృత్వంలోని ఎంజీటీ సీనియర్ సిటిజన్లను అలరిస్తోందని, ఇలాంటి కార్యక్రమాలు మళ్లీ జరగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కన్సర్న్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పీకే జోష్ మాట్లాడుతూ, ఎంజీటీ త్వరలో వయోవృద్ధులతో పాటు విభిన్న ప్రతిభావంతుల కోసం కూడా ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంజీటీ సభ్యులు సహకరిస్తే వృద్ధుల కోసం సొంత భవనం నిర్మించాలని ఉందని, భవిష్యత్తులో ఈ కేంద్రం వారికి ఆసరాగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ బాలోత్సవ్ కమిటీ చైర్‌పర్సన్, ఎంజీటీ కో-కన్వీనర్ కోరెడ్ల రమాప్రభ మాట్లాడుతూ, కన్సర్న్ సంస్థ వివిధ వర్గాలకు విశేషమైన సేవలు అందిస్తోందని, వారి నిస్వార్థ సేవకు మద్దతుగా తమ సంస్థ కూడా కలిసి పనిచేస్తుందని చెప్పారు. సంస్థ సహ కన్వీనర్ సూరంపూడి వీరభద్రరావు మాట్లాడుతూ, వయోవృద్ధుల కోసం శాశ్వత చిరునామా ఏర్పాటు చేసే ప్రయత్నాలు ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా రమాప్రభ బృందం నిర్వహించిన వినోద కార్యక్రమాలు, క్రీడలు వృద్ధులను ఉల్లాసపరిచాయి. వీ డెంటల్ , వీ హెల్త్‌కేర్ అధినేత డాక్టర్ రమేష్ వృద్ధులకు దంత సంరక్షణపై మెళకువలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజువాడ కిరణ్‌కుమార్, డాక్టర్ జ్యోత్స్న, తేజ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీలు అస్తవ్యస్తం



పూలసందులో యూజీడీ




పందుపుల్లల సందులో యూజీడీ మధ్యలో పెట్టిన కర్ర

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ) అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామకృష్ణ జంక్షన్ వద్ద కెనాల్‌పై ఉన్న ఇనుప చట్రం పూర్తిగా శిథిలమై ప్రమాదకరంగా మారింది. దీంతో ఆ ప్రాంతంలోని వ్యాపారులు కర్రలకు ఎర్రటి క్లాత్ కట్టి ప్రమాద సూచనలు ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ ప్రమాదవశాత్తు ఎవరైనా కెనాల్‌లో పడితే నేరుగా సముద్రంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, పూలసందులో ఉన్న యూజీడీ పైకప్పు కూడా శిథిలమైపోవడంతో వాహనదారులు ఆ మార్గంలో వెళ్లడానికి భయపడుతున్నారు. వీధుల్లో ఆడుకునే చిన్నారులు ఎక్కడ ప్రమాదానికి గురవుతారోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దుర్వాసన వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కెనాల్, యూజీడీలపై మూతలు వేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ఎస్.జానకి ప్రత్యేక సినీ సంగీత విభావరి

మద్దిలపాలెం: ప్రముఖ సినీ నేపథ్య గాయని ఎస్. జానకి 87వ జన్మదినోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం 6.30 గంటల నుంచి కళాభారతి ఆడిటోరియంలో సినీ సంగీత విభావరి జరగనుంది. యాక్మీ, జయంతి చౌదరి క్రియేషన్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి అని యాక్మీ ప్రతాప్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ బెంగాలీ నృత్య దర్శకురాలు సువశ్రీ బగ్చిని ఉగాది పురస్కారంతో సత్కరించనున్నారు. నగరానికి చెందిన ప్రముఖ గాయనీ గాయకులు ఆర్ సత్య, సుజాత, ఆనంద్, అనూష, కళ్యాణి ఎస్. జానకి పాడిన మధురమైన గీతాలను ఆలపించనున్నారు.

శ్మశాన వాటిక సమస్యపై కలెక్టర్‌కు వినతి



వినతి పత్రం చూపుతున్న మక్కామసీదు కమిటీ అధ్యక్షుడు మునీర్, కార్యదర్శి అమీర్‌జాన్

దాబాగార్డెన్స్: మహారాణిపేట దండుబజార్ జీవీఎంసీ హైస్కూల్ ఎదురుగా ఉన్న శ్మశాన వాటికలో కొత్త సమాధులు పూడ్చేందుకు స్థలం లేదని మక్కా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ మునీర్ తెలిపారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. దండుబజార్ హైస్కూల్‌కు తూర్పున ఉన్న ఈ బరియల్ గ్రౌండ్ 170 ఏళ్లుగా వినియోగంలో ఉందని మునీర్ తెలిపారు. మక్కా మసీదుతో పాటు మరో నాలుగు మసీదుల పరిధిలోని ముస్లింలు మరణిస్తే ఇక్కడే ఖననం చేస్తారన్నారు. ప్రస్తుతం బరియల్ గ్రౌండ్ పూర్తిగా నిండిపోవడంతో కొత్తవారిని ఖననం చేసేందుకు స్థలం లేదని, ఈ విషయాన్ని ఈ నెల 21న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని ఆయన అన్నారు. బరియల్ గ్రౌండ్ చుట్టూ ఉన్న కబ్జాదారులను తొలగిస్తే స్థలం సమస్య తీరుతుందని కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు మునీర్ తెలిపారు.

ప్రపంచ దేశాలకు విశ్వగురువు భారత్



సోము వీర్రాజును సత్కరిస్తున్న పలు పార్టీల నాయకులు

అల్లిపురం: ప్రపంచ దేశాలకు భారతీయ జీవన విధానం ఆదర్శనీయంగా నిలుస్తుందని.. ఆయా దేశాలకు విశ్వ గురువుగా మార్గదర్శకం చేసే రోజు దగ్గరలోనే ఉందని బీజేపీ జాతీయ నాయకుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని ఓ హోటల్‌లో బీజేపీ నాయకుడు జనపరెడ్డి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో అన్ని దేశాల్లోనే భారతీయులు ఎంతో ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. ఆయా దేశాల్లో కూడా అభివృద్ధికి తోడ్పాటునందించడంలోను ఎంతో అగ్రగామిగా ఉన్నారన్నారు. భారతదేశం ఏ ఒక్క దేశంతోను విభేదాలు పెంచుకోదన్నారు. అందరితో సామరస్య పూర్వకంగా ముందుకు సాగే విధానమే ఏకైక లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా సోము వీర్రాజును సత్కరించారు. కార్యక్రమంలో బొలిశెట్టి సత్యనారాయణ, సత్యారావు మాస్టారు, ఆకుల చంద్రశేఖర్, కోరాడ రాజబాబు, పసుపులేటి ఉషాకిరణ్, గంట్ల శ్రీనుబాబు, గుడివాడ అమ్మన్న, అశోక్‌కుమార్, రాగాల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.